క్లుప్తంగా

మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



ప్రధాన కాలువలో పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: రానున్న నాలుగు రోజుల్లో భారీ వర్ష సూచనల నేపథ్యంలో రాయదుర్గం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇప్పటికే అత్యవసర సేవల నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. అత్యవసరం అయితే 9154566253 నెంబర్‌కు కాల్ చేయాలని తెలియజేశారు. ఆదివారం పట్టణంలోని ముంపు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటించి పూడిక తీత పనులను పర్యవేక్షించారు. కొలిమి వీధి, రామస్వామివీధి, పాత మీ సేవా ఏరియా, మధు టాకీస్ ఏరియా, చికెన్ మార్కెట్ ఏరియాల్లో విస్తృతంగా పర్యటించారు. శానిటేషన్ విషయమై ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌కు సూచనలు చేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



హెచ్చెల్సీ గట్టును పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం (డి హీరేహాళ్): భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ రఘునాథ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం డీ హీరేహాళ్ మండలంలోని నాగలాపురం వద్ద హెచ్‌ఎల్సీ కాలువ గట్టును పరిశీలించారు. అనంతరం సోములాపురంలో పర్యటించారు. అనంతరం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు.

ఉరవకొండలో కంట్రోల్ రూం ఏర్పాటు



కంట్రోల్ రూంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓలు

ఉరవకొండ: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంను మండల ప్రత్యేక అధికారి బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బుకొఠారి పర్యవేక్షించి, వరద పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రమౌళి సిబ్బందితో సమావేశమయ్యారు. అత్యవసరమైతే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలన్నారు.

రైతు సంఘం జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కూడేరు: కూడేరులోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దినోత్సవాన్ని(జాతీయ కొర్కెల దినోత్సవం) జరుపుకున్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ఏపీ రైతు సంఘం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. సంఘం తాలుకా వర్కింగ్ ప్రెసిడెంట్ వర ప్రసాద్, మండల కార్యదర్శి రమణ, వ్యాసం జిల్లా కమిటీ సభ్యులు పెరుగు సంగ ప్ప, సీపీఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, నాయకులు మలరాయుడు, జ్యోతిరాణి, వరలక్ష్మి, ఆదెమ్మ, సునీత, నల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత



విరాళం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కూడేరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1991–92 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన రాజేశ్వరి (పి.నాగిరెడ్డిపల్లి), సుంకమ్మ (కరుట్ల పల్లి), కుంటెన్న (కొర్రకోడు)లు ఆదివారం ఒక్కొక్కరు రూ.10 వేలు చొప్పున అందించారు. ఈ మొత్తాన్ని స్కూల్ హెచ్ఎం శ్రీదేవికి అందజేయాలని వారు తోటి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ భాస్కర్, బొజ్జన్న యాదవ్, మలోబులు, విశ్వనాథ్, శ్రీనివాసులు, ప్రసాద్, రామాంజనేయులు, నాగేంద్ర, లింగమయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

దుర్గం కన్నీళ్లు తుడిచిన రాజన్న

- వైఎస్సార్ హయాంలో రూ.52 కోట్లతో తాగునీటి పథకం
- గలగలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
- లక్షలాది ఇళ్ల నిర్మాణాలకు ఇక్కడి నుంచే ఆరంభం
- వైఎస్సార్‌తో 'దుర్గం'కు విడదీయరాని బంధం



గలగలలో పైలాన్ ప్రారంభిస్తున్న వైఎస్సార్ (ఫైల్)



కణేకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు

రాయదుర్గం: కరువు రక్కసిని శాశ్వతంగా తరిమికొట్టి.. అన్నదాతల కష్టాలను తీర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో భగీరథ ప్రయత్నమే చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు పెద్దపీట వేశారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు సింహభాగం నిధులు ఖర్చు చేశారు. అనంత లాంటి కరువు సీమకు జీడిపల్లి రిజర్వాయర్‌ను జీవనాడిగా మార్చారు. బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు మళ్లించి రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని సంకల్పించారు. ఆయన అకాల మరణంతో ఈ ప్రక్రియ అర్ధంతరంగా ఆగింది. తర్వాత 2014–19 మధ్య టీడీపీ అధికారంలోకొచ్చినా కాలయాపన చేశారు. తండ్రి ఆశయాన్ని పుణికిపుచ్చుకున్న వైఎస్ జగన్.. 2019–24 మధ్య సాగునీటి అవసరాలు తీర్చేలా ముందడుగు వేశారు. భూసేకరణ రైతులకు రూ.202 కోట్లు నిధులు విడుదల చేశారు. ప్రక్రియ తుది దశకు చేరుకునేలోపు మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది.

పట్టణ వాసులకు తుంగభద్ర జలాలు

పట్టణంలో 2004కు ముందు తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొని ఉండేది. బిందెడు నీటి కోసం బండెడు కష్టాలను ప్రజలు అనుభవించారు. ఈప్రాంతంలో ఏ ఇంటికైనా పిల్లను ఇవ్వాలన్నా, శుభకార్యాలకు బంధుమిత్రులు రావాలన్నా నీటి కష్టాలపై మాట్లాడుకునే పరిస్థితి ఉండేది. వేసవి వచ్చిందంటే చాలు కన్నీళ్లు రాలేవి. 75 వేల మంది జనాభా ఉండే పట్టణానికి అరకొర నీటి పథకాలు సరిపడేవి కాదు. సమస్య తీవ్రతను గుర్తించిన అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శాశ్వత పరిష్కార మార్గం చూపేలా చర్యలు చేపట్టారు. హెచ్ఎల్సీ బోర్డులో 0.2 టీఎంసీల నీటి కేటాయింపులు చేయించారు. వైఎస్సార్‌నీటి పథకం పేరుతో రూ.52 కోట్లు మంజూరు చేశారు. కణేకల్లు వద్ద సమ్మర్ స్టోరేజీ నిర్మించి, అక్కడి నుంచి పట్టణానికి 27 కిలో మీటర్ల దూరం పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. నాలుగు పంప్‌హౌస్‌లు నిర్మించి, సమృద్ధిగా సాగునీరందించేలా చర్యలు చేపట్టారు.

గలగలలో ఇందిరమ్మ పథకం ప్రారంభం

గుమ్మఘట్ట మండలం గలగలలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. శంకుస్థాపన చేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. ఆ ఒక్క గ్రామానికే 860 ఇళ్లు మంజూరు చేశారు. గుడిసె అన్నది కనిపించకుండా చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఇళ్లు నిర్మించి, పేదల సొంతింటి కల నెరవేర్చారు.

ఇంటింటా తాగునీరు వైఎస్సార్ చలువే



వైఎస్సార్ మన మధ్యలేడన్నదే కానీ..ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచారు. జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టుల నిర్మాణాలకు పెద్దపీట వేశారు. సాగు, తాగునీటి అవసరాలు తీర్చారు. రాయదుర్గం ప్రజలకు శాశ్వత తాగునీటి ఇబ్బందులు తీర్చారు. ఇంటింటా తాగునీరు అందుతోందంటే వైఎస్సార్ చలువే. అంతటి మహనీయుని వర్ధంతి వేడుకలను పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి, దిగ్విజయం చేయాలి. పట్టణంలో చేపట్టే పలు సేవా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలి. ఆర్అండ్‌బీ అతిథి గృహం, శాంతినగర్ వద్ద ఉండే విగ్రహాలకు క్షీరాభిషేకాలు, సేవా కార్యక్రమాలు చేపట్టనున్నాం.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

నేడు వైఎస్సార్ వర్ధంతి

బొమ్మనహాళ్: డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కణేకల్లు: కణేకల్లులో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కంబదూరు: మండల కేంద్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజుయాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేయనున్నట్లు తెలిపారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వజ్రకరూరులో ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటలకు వజ్రకరూరులోని బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేయనున్నట్లు తెలిపారు.

చెత్త ట్రాక్టర్ అప్పగింతపై విమర్శలు

గుమ్మఘట్ట: జనాభా అధికంగా ఉన్న పూలకుంట, గలగల గ్రామ పంచాయతీకి చెత్త తరలించే ట్రాక్టర్ మంజూరయ్యింది. అయితే గ్రామ పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ను సర్పంచ్‌కు అప్పగించుకుండా పంచాయతీ కార్యదర్శి రాజేష్ నేరుగా గ్రామ టీడీపీ నాయకుడికి అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీన్నిబట్టి పూలకుంట, గలగల పంచాయతీలో ప్రజాప్రతినిధి ఒకరు..పెత్తనం మరొకరికి అన్నట్లుందని చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అధికారులు బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై పంచాయతీ కారదర్శి రాజేష్‌ను అడగ్గా , ట్రాక్టర్‌కు ట్రాలీ వచ్చినప్పుడు అప్పగిద్దామనుకున్నట్లు సమాధానం ఇచ్చారు.

వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా



సోములాపురం వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న డీడీ కుష్బుకొఠారి

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని సోములాపురం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సోషల్ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని పలు సౌకర్యాలపై వార్డెన్ శ్రీనివాసులుతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మెనూ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బిల్డింగ్ భద్రత ప్రమాణాలపై అడిగి తెలుసుకున్నారు. అనుమతుల్లేకుండా విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపొద్దని ఆదేశించారు. వార్డెన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పంటల పరిశీలన

ఉరవకొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏఓ శుభకర్ క్షేత్రస్థాయిలో ఆదివారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా వేరుశనగ, కంది, ఆముదం లాంటి పంటలు ఎంత విస్తీర్ణంలో సాగుచేశారో, ఎంత మేర పంటలు దెబ్బతిన్నాయో వివరాలు సేకరిస్తున్నామన్నారు.

బాలికలకు ఉచిత కరాటే శిక్షణ

ఉరవకొండ: బాలికలకు కరాటేలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరాటే మాస్టర్ ఓబుళరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎనిమిదేళ్లు పైబడిన బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 7:30 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

రేరింగ్ షెడ్లకు బిల్లు మంజూరు చేయండి

కుందుర్పి: మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో నిర్మించిన రేరింగ్ షెడ్లకు బిల్లులు మంజూరు చేయాలని రైతులు హరికృష్ణ, గోపాల్, రామచంద్రప్ప, మంజునాథ్ తదితరులు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ షెడ్ల నిర్మాణాలను సైజులను బట్టి ఒక్కో రేరింగ్ షెడ్లు ఉపాధిహామీ పథకం, సిరికల్చర్ శాఖ ద్వారాను రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు షెడ్ల నిర్మాణాలకు బిల్లులు అందాలన్నారు.

లీకేజీతో తాగునీరు వృథా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు రైల్వేగేటు పక్కన సీబీఎస్ కాలనీకి వెళ్లే దారిలో తుంగభద్ర జలాల తాగునీటి పంపింగ్ పైప్‌లైన్ భారీగా లీకేజీ అవుతోంది. దాదాపు మూడు నెలలుగా లీకేజీతో తాగునీరు వృథా అవుతున్నట్లు కాలనీవాసులు చెప్తున్నారు. ఫిల్టరేషన్ పాయింట్ నుంచి నీరు జీఎల్ఎస్ఆర్ ట్యాంకులకు పంపింగ్ చేసే పైప్‌లైన్‌కు లోపల పెద్ద రంధ్రం పడినట్లు తెలుస్తోంది. ఈ విషయమై మున్సిపల్ ఇన్‌చార్జ్ ఏఈ కోదండను అడగ్గా, లీకేజీ కోసం మొత్తం పంపింగ్ ఆపి పనులు చేయాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సాధ్యమైనంత త్వరగా లీకేజీ అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

కణేకల్లు: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా వర్షం పడుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం దెబ్బకు చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసరమైతే తప్పా బయటికి రావడం లేదు. వర్షం నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించిందని ఎంఈఓ లక్ష్మన్న తెలిపారు.

దేశీయ ఆవులు, ఎద్దుల కోసం దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: దేశీయ ఆవులు, ఎద్దులకోసం చిన్న,సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సీఎస్సీ కంపెనీ అధ్యక్షుడు లక్ష్మీపతి, కార్యదర్శి నరసింహమూర్తి తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.కునుమగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (సీఎస్సీ) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే పశువులు అందిస్తామన్నారు. ఆవులు, ఎద్దులు, లేగదూడలు మొదటి విడతలో 25 మందికి అందిస్తామన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ ఆర్. సుమతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వసతి గృహం భవనాన్ని పరిశీలించారు. అనంతరం వసతి గృహంలో సమస్యలను విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో వేణు తదితరులు పాల్గొన్నారు.

రేపు గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

మోస్తరు వర్షం

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి మోస్తరు వర్షం కురిసింది. 4.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరుట్లపల్లి చెరువుకు జలకళ



కూడేరు: నీటితో నిండుకుండలా దర్శనమిస్తున్న కరుట్లపల్లి చెరువు

కూడేరు: మండల పరిధిలోని కరుట్లపల్లి చెరువుకు జలకళ వచ్చింది. వర్షం నీటితో నిండి మరువ పారుతోంది. గత 15 రోజులుగా పి.నారాయణపురం, ఎంఎంహళ్లితో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం నీరు వచ్చి కరుట్లపల్లి చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువు నీటితో నిండు కుండలా దర్శనమిస్తోంది. కరుట్లపల్లి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని ధర్నా



రాయదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

రాయదుర్గంటౌన్: పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులు హెచ్చరించారు. ఆదివారం ఏపీటీఎఫ్ రాయదుర్గం ఉమ్మడి జోన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ సిస్టంను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయకూడదని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ రఘుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌నాయకులు రామకృష్ణ, పాండు, మల్లికార్జున, సిద్దేశ్వర, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి మౌనిక

బొమ్మనహాళ్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని రాయదుర్గం ఉద్యాన అధికారిణి మౌనిక సూచించారు. మండలంలోని సాగు చేసిన పంటలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు కురిసిన వర్షంతో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు అవసరమైతే పంట పొలాల చుట్టూ తాత్కాలిక డ్రైనేజీలు నిర్మించి, అదనపు నీరును బయటికి తరలించాలన్నారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి



కదిరిదేవరపల్లిలో ఉద్యాన రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్న హెచ్ఓ గౌసియాబేగం

కంబదూరు: భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారిణి గౌసియా బేగం సూచించారు. ఆదివారం మండలంలోని కదిరిదేవరపల్లిలో ఆమె పర్యటించారు. సాగైన అరటి,బొప్పాయి, టమాటా వంటి ఉద్యాన పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు,సూచనలు ఇచ్చారు. భారీ వర్షానికి పంట పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంతవరకు కాలువలు ద్వారా బయటకు పంపాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే ఉద్యాన శాఖాధికారులు చెప్పిన మందులను పిచికారీ చేయాలని తెలియజేశారు.

పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

రాయదుర్గంటౌన్: అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగాయని, ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో కరపత్రాలు విడుదల చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కొ్ట్రేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఈనెల 6 వరకు నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, గురుస్వామి, పార్వతి, నాగరాజు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు



కొనుకొండ్ల గురునాథ్ స్వామి ఆధ్వర్యంలో వివాహాలు జరిపిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రంలో కొనుకొండ్ల గురునాథ్ స్వాములు ఆధ్వర్యంలో సద్గురు నాథ ఆలయంలో ఆదివారం సామూహిక వివాహాలు వైభవంగా జరిగాయి. ఆర్థికంగా వెనుకబడిన ఆరు పేద జంటలకు వైభవంగా వివాహం జరిపించారు. నూతన వధూవరులకు మంగళసూత్రం, కాలి మెట్టెలు, దుస్తులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బళ్లారి మల్లికార్జున, సుంకన్న, సర్పంచ్ తిప్పేస్వామి, ఉప సర్పంచ్ సుదర్శన్, పూజారి శ్రీరాములు, హనుమంతరెడ్డి, పల్లి రామకృష్ణ, టైలర్ గోవిందు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కొందరిపైనే 'మున్సిపల్' ప్రతాపం

- అక్రమ నిర్మాణాల తొలగింపు
- డ్రెయినేజీలకు అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపు
- మున్సిపల్, పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణల తొలగింపు



సాయిబాబా ఆలయం వద్ద అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం



కళ్యాణదుర్గంలో ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన కల్వర్టు

▸▸ ఇదిగో ఇక్కడ డిగ్రీ కళాశాల ప్రధాన ద్వారానికి అనుకొని ఉన్న కల్వర్టు కళ్యాణదుర్గం– అనంతపురం ప్రధాన రహదారిలోనిది. పట్టణంలోని వడ్డే కాలనీ, మారెంపల్లి, ఎర్రనేలవీధి, ముదిగల్లు రోడ్డు, పార్వతీనగర్ ప్రాంతాల నుంచి మురుగునీరంతా ఇదే కల్వర్టు గుండా దొడగట్ట రోడ్డులోని సుబేదారు చెరువుకు వెళ్లాల్సి ఉంది. అయితే అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారుల అనాలోచిత నిర్ణయాలకు ప్రస్తుతం వర్షం పడిందంటే చాలు..అనంతపురం ప్రధాన రహదారి వంకను తలపిస్తోంది. కాలువ ఎంత పెద్దదయినా కల్వర్టు చిన్నదిగా ఉంటే నీరెలా పారుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కళ్యాణదుర్గం:కళ్యాణదుర్గంలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసేందుకు ఆదివారం నడుం బిగించారు. ఇందులో భాగంగానే భారీ వర్షానికి మురుగునీటి కాలువలు కుంచించుకుపోయి అనంతపురం ప్రధాన రహదారి, సాయిబాబా ఆలయం ఎదురుగా వంకను తలపిస్తోంది. దీంతో అప్పట్లో వాహనదారులు, స్థానికులు వర్షపు నీటితో అవస్థలు పడ్డారు. అయితే కొందరిపైనే మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారని నోటీసులందుకున్న బాధితులు వాపోతున్నారు.


డ్రైనేజీలకు అడ్డంగా ఉన్న నిర్మాణాలు తొలగింపు..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరోసారి డ్రైనేజీ కాలువలు నిండిపోయి మురుగునీరు ప్రధాన రహదారిలోకి రాకుండా మున్సిపల్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముందుస్తు చర్యల్లో భాగంగా మురుగునీటి కాలువను ఆక్రమించి, కట్టడాలు చేపట్టిన వారికి పదిరోజుల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయితే ఆక్రమణదారుల నుంచి స్పందనా రాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ పోలీసు శాఖ సహకారంతో అక్రమ నిర్మాణాలను తొలగింపునకు చర్యలు చేపట్టారు.

తప్పుదోవపట్టిస్తున్న కబ్జాదారులు..

మురుగునీటి కాలువను ఆక్రమించుకుని అక్రమంగా నిర్మించిన కొందరు తమకు కోర్టు నోటీసులున్నాయని మున్సిపల్ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు సైతం ఆక్రమణల తొలగింపులో కొందరిపైనే ప్రతాపం చూపుతున్నారని నోటీసులు అందుకున్న బాధితులు చెప్తున్నారు. దీనికి తోడు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అక్రమంగా నిర్మించిన కొందరి నిర్మాణాల జోలికి వెళ్లకుండా కొందరివే బలవంతంగా తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కలెక్టర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాల తొలగింపు..



భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కళ్యాణదుర్గంలో డ్రైనేజీ వ్యవస్థకు ఎలాంటి అడ్డంకి ఉండకూడదన్న కలెక్టర్ ఆదేశాల మేరకు మురుగు కాలువల్లో పూడిక తీయిస్తున్నాం . మురుగు కాలువ స్థలంలో అక్రమ కట్టడాలు తొలగిస్తాం. గతంలోనే ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చాం. కాలువ వెంట ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తాం. కొందరు స్పందించకపోవడంతో జేసీబీలతో తొలగిస్తున్నాం. పట్టణంలో గాంధీచౌక్, మేడా వీధిలలో కూడా డ్రైనేజీ వ్యవస్థకు అడ్డంకిగా ఉన్న అక్రమ నిర్మాణాలను దశలవారీగా తొలగిస్తాం.

– వంశీకృష్ణ భార్గవ్, మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గం